వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 275 మంగళవారం | 14 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



2లో

## 5వ రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు

వేదాతలుగా వ్యవహరించిన నాయి బ్రాహ్మణులు

# ఓటు నోటు


## పంచేది తక్కువ.. నొక్కేది ఎక్కువ

పార్టీ ఫండ్ రిలీజ్ చేసినా.. ఓటరుకు చేరని డబ్బులు

దండుకున్న మధ్యవర్తులు పలు ప్రాంతాల్లో నిలదీతలు

కార్యకర్తలకు ఎప్పటిలాగే మొండిచేయి

అన్ని ప్రధాన పార్టీల్లో ఇదే తంతు



తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు అన్ని రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలల పాలనకు లోక్ సభ ఎన్నికలు రెఫరెండంగా భావించగా అధికారం కోల్పోయి ప్రతిపక్షానికే పరిమితమైన బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా డబుల్ డిజిట్ సాధించి పూర్వ వైభవాన్ని దక్కించుకోవాలని చూసింది. అయితే భారతీయ జనతా పార్టీ మాత్రం మోడీ మేనియా అంటూ ప్రచారం చేయడం ద్వారా డబుల్ డిజిట్ సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే పోలింగ్ కు మరో 24 గంటల సమయం ఉండగానే రాజకీయ పక్షాలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పోటీ పడ్డాయి. ఇందుకుగాను వరంగల్ లోక్ సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ రూ.35కోట్ల పార్టీ ఫండ్ రిలీజ్ చేసినట్లు తెలిసింది. మేమేమీ తక్కువ కాదంటూ బీజేపీ రూ.21 కోట్లు, బీఆర్ఎస్ రూ.14కోట్లు రిలీజ్ చేసినట్లు ప్రచారం సాగింది. అయితే ఓటరుకు చేరాల్సిన ఈ ఫండ్ ను మధ్యవర్తులే దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. పంచేది తక్కువ.. నొక్కేది ఎక్కువ అన్న చందంగా ఈ దందా సాగడంతో ఓటరుకు ఎదురుచూపులు తప్పలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సాగిన నగదు పంపిణీపై నిఘా నేత్రం ఉన్నప్పటికీ అడ్డుకోలేక పోయింది.

వివరాలు 2లో..

- వరంగల్ వాయిస్, వరంగల్



## భవితవ్యం.. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం

ఏనుమాముల మార్కెట్‌కు చేరిన ఈవీఎంలు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్

68.86 శాతం పోలింగ్ నమోదు

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

8లో..



## స్ట్రాంగ్ రూమ్స్‌కు.. మూడంచెల భద్రతా

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

కేంద్ర సాయుధ బలగాలకు సత్కారం




2లో


## 50 వేల మెజారిటీతో గెలుస్తున్నా..

సైలెంట్ ఓటింగ్ నావైపే

బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

మంగళవారం 14, మే 2024
www.warangalvoice.net

# ఓటు.. నోటు



**పంచేది తక్కువ.. నొక్కేది ఎక్కువ**

**పార్టీ ఫండ్ రిలీజ్ చేసినా..**

**ఓటరుకు చేరని డబ్బులు**

**దండుకున్న మధ్యవర్తులు**

**పలు ప్రాంతాల్లో నిలదీతలు**

**కార్యకర్తలకు ఎప్పటిలాగే మొండిచేయి**

**అన్ని ప్రధాన పార్టీల్లో ఇదే తంతు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికలు అనగానే ఓటు..నోటు అన్న చందంగా మారింది. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలోనే వారి జయాపజయాలు ఆధారపడుతున్నాయి. ఇందుకు ఆ పార్టీ..ఈ పార్టీ అన్న తేడాలేవీ లేవు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నగదు పంపిణీ చేయడం సర్వసాధారణంగా మారింది. అయితే ఈ నగదు పంపిణీతో లాభపడుతున్నది మాత్రం మధ్య వర్తులే అన్న ప్రచారం సాగుతోంది. పంచేది తక్కువ..నొక్కేది ఎక్కువ అన్న చందంగా ఈ దంగా సాగుతోంది. ఒక్కో ఓటుకు ఇంతా అని లెక్కగట్టి ప్రధాన పార్టీలన్నీ పార్టీ ఫండ్ పేరుతో పెద్ద మొత్తంలో రిలీజ్ చేస్తున్నా చాలా ప్రాంతాల్లో ఓటరుకు ఆ డబ్బులు చేరడం లేదు. దీంతో నోటు ముట్టందే ఓటు వేయమంటూ చాలా మంది ఓటు వేసేందుకు విముఖత చూపుతున్నారు.

## ప్రచారానికి రూ.63 కోట్లు..

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ ఎస్ లు పెద్ద మొత్తంలోనే ఖర్చు చేసినట్లు సమాచారం. నామినేషన్ల పర్వం ముగియగానే ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారానికి రూ.3కోట్లు కేటాయించారు. ఇలా మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం రూ.21కోట్లను ఆయా పార్టీలు మొదటి విడతగా రిలీజ్ చేసినట్లు సమాచారం. ఇలా ఒక్కో పార్టీ రూ.21కోట్ల చొప్పున మొత్తం మూడు పార్టీలు రూ.63కోట్లను రిలీజ్ చేశారు. అయితే ఇందులోనే పార్టీ శ్రేణులు సగం నొక్కేసినట్లు ప్రచారం సాగుతోంది.



## పంపిణీకి రూ.70కోట్లు..

ఎన్నికల ప్రచారానికి ఒక్కో నియోజకవర్గానికి రూ.21కోట్ల చొప్పున రిలీజ్ చేసిన ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మరో రూ.70కోట్లు రిలీజ్ చేసినట్లు చెప్పుకొంటున్నారు. ఇందులో అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్కో ఓటరుకు రూ.300 చొప్పున చెల్లించాలని నిర్ణయించి ఒక్కో నియోజకవర్గానికి రూ.5కోట్ల చొప్పున మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రూ.35కోట్లు రిలీజ్ చేసినట్లు ప్రచారం సాగింది. అదే విధంగా భారతీయ జనతా పార్టీ ఒక్కో ఓటరుకు రూ.200 చొప్పున చెల్లించేలా ప్రణాళిక రూపొందించి ఒక్కో నియోజకవర్గానికి రూ.3కోట్ల చొప్పున మొత్తం రూ.21కోట్లు, బీఆర్ ఎస్ పార్టీ ఒక్కో ఓటరుకు రూ.100 చెల్లించాలని నిర్ణయించి అందుకు గాను ఒక్కో నియోజకవర్గానికి రూ.2కోట్ల చొప్పున మొత్తం రూ.14కోట్లు విడుదల చేసినట్లు తెలిసింది. అయితే అందిన కాడికి దండుకోవడమే లక్ష్యంగా కొంతమంది పార్టీ శ్రేణులు పనిచేసినట్లు ప్రచారం సాగుతోంది.

## పంచుకున్నారు..

వరంగల్ లోక్ సభ పరిధిలోకి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ ఎస్ లు పెద్ద మొత్తంలోనే డబ్బులు రిలీజ్ చేశారు. అయితే వీటిలో అధిక శాతం నిధులును పంచకుండానే నొక్కేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్య నాయకులు వాటిని వాటాలుగా పంచుకున్నట్లు ప్రచారం సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నగదు పంపిణీ గుట్టు చప్పుడు కాకుండా సాగినప్పటికీ పట్టణ ప్రాంతంలో మాత్రం అధిక శాతం ఓటర్లకు ఈ డబ్బులు అందలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో పట్టణ ప్రాంత వాసులు ఓటు వేసేందుకే విముఖత చూపినట్లు పోలింగ్ శాతాన్ని బట్టి తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని యువత మాత్రం స్వచ్ఛందంగా ఓటు వేయగా వృద్ధులు, మహిళలు పార్టీలు అందజేసే తాయిలాలకోసం ఆశగా ఎదురు చూసినట్లు తెలుస్తోంది.

## ఓటరు స్లిప్పులు చూసి..

ప్రతీ ఒక్కరు ఓటరు స్లిప్పులు చూపిస్తేనే డబ్బులు అందజేస్తామన్న నిబంధన పెట్టడంతో తెల్లవారు జామునుంచే ఓటర్లు గుంపులు గుంపులుగా చేరి నోట్లు తెచ్చే వారికోసం ఎదురు చూశారు. మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అందరూ డబ్బుల కోసం గంటలపాటు నిరీక్షించారు. అయితే అధికారులు వస్తున్నారన్న బూచి చూపి చాలా ప్రాంతాల్లో ఓటర్లకు డబ్బులు ఇవ్వకుండానే పలాయనం చిత్తగించినట్లు ఆరోపణలున్నాయి. స్థానిక పోలీసులుసైతం చూసీ చూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ప్రధాన మూడు పార్టీలు డబ్బులిచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని కొందరు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన వాపోతున్నారు. ఏది ఏమైనా ఎన్నికలు వచ్చాయంటే ఓటర్ల పేరు చెప్పుకొని బాగుపడుతున్న మధ్యవర్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. దీనిని అరికట్టడంలో నిఘా సంస్థలు ఫెయిల్ అయ్యాయన్న ప్రచారం సాగుతోంది.

# 5వ రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీ భద్రకాళి భద్రేశ్వరల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం 5వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి నిత్యాహీనకం నిర్వహించిన తదుపరి చతుస్థానార్చన జరిపించిన అర్చకులు ఉదయం అమ్మవారికి పల్లకి సేవ సాయంకాలం శేష వాహన సేవలపై అమ్మవారిని ఊరేగించారు. పల్లకి సేవలో ఉన్న అమ్మవారిని దర్శించిన వారికి సమస్త భోగాలు సమకూరుతాయని ప్రచారంలో ఉంది. ప్రజలు వారికి బ్రహ్మరథం పడతారు. శేష వాహనంపై సేవింపబడుతున్న అమ్మవారిని దర్శించిన వారికి కుండలిని శక్తి జాగృతమై సకల సిద్ధులు కలుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈరోజు కార్యక్రమాలకు హనుమకొండ జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం వారు వేదాతలు వ్యవహరించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వీరందరిని నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు దుషాలువలతో సత్కరించారు. హనుమకొండ జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగవెల్లి సురేష్ కుమార్ నేతృత్వంలో నాయి బ్రాహ్మణ సంఘం వారు ఉత్సవ యాజమాన్యాన్ని స్వీకరించి ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయి బ్రాహ్మణ ప్రముఖులలో విశ్రాంత సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ దుగ్యాల అశోక్ కుమార్, బీజేపీ రాష్ట్ర నేత సూర్య పల్లి శ్రీనివాస్, ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు కొడిపాక కుమారస్వామి, కురిమిల్ల రమేష్, శ్రీరాముల రమేష్, శ్రీరాముల నరేందర్, రామోజీ జగన్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా విద్యారణ్య జయంతి..

విద్యారణ్య జయంతిని పురస్కరించుకొని భద్రకాళి దేవస్థానం ప్రధాన రహదారి కూడలిలోని శ్రీ విద్యారణ్యుల విగ్రహానికి పుష్ప మాల సమర్పించి విద్యారణ్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాలిక్ కాఫర్ దండయాత్రలో కాకతీయ సామ్రాజ్యం చిన్నా భిన్నమై సనాతన ధర్మం దేశంలో పతనావస్థకు చేరుకున్న తరుణంలో విద్యారణ్యుడు ప్రజలను జాగరుకులను చేసి వెన్ను తట్టి హరిహర బుక్కరాయల ద్వారా ఆనెగొంది వద్ద విజయనగర సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన హైందవ సాంస్కృతిక పునరుజీవన నిర్మాణకర్త శ్రీ విద్యారణ్యులు. ఇతను వరంగల్ వాసి కావడం గర్వకారణం. నాలుగు వేదాలకు భాష్యాలు రాసిన వేద విజ్ఞానాన్ని ప్రజల ముంగిట తెచ్చి సకలజనులు దక్షిణాపతం మొదలుకొని సమస్త భారతావనిలోని ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లే విధంగా బాటలు వేసిన మహనీయులు శ్రీ విద్యారణ్యులు. దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదా పీఠాన్ని శృంగేరి మహాసంస్థానంగా తీర్చిదిద్ది ధర్మసంస్థాపనలు శృంగేరి పీఠాన్ని మకుటాయమానంగా చేసిన మహా ఘనుడు, శృంగేరి 12వ పీఠాధిపతులు శ్రీ విద్యారణ్యులగా కొనియాడారు.

# 50 వేల మెజారిటీతో గెలుస్తున్నా..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోటో పోటీగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 50 వేల మెజారిటీతో విజయం సాధిస్తున్నానని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రకటించారు. మంగళవారం హనుమకొండ, హంటర్ రోడ్ లోని వేద ఫంక్షన్ హాల్ లో బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్, వరంగల్ - నల్లగొండ -ఖమ్మం గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేంధర్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ మోడీని బలపర్చడానికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా, హైదరాబాద్, బెంగుళూరు నుంచి కూడా వచ్చి తనకు ఓటేసినట్లు వెల్లడించారు. ప్రజలను ప్రలోభ పెట్టినా కూడా వాళ్ళు నావైపే ఉన్నారన్నారు. నన్ను చూస్తే కాంగ్రెస్ వెన్నులో వణుకు పుడుతోందన్నారు. పోలింగ్ జరుగుతున్న కూడా ఓట్ ఫర్ కాంగ్రెస్ అని సోషల్ మీడియాలో ప్రచారం చేశారని ఆరోపించారు. బీజేపీకి పూర్వ వైభవం రావాలని కసితో మా క్యాడర్ పని చేశారని గుర్తు చేశారు. సైలెంట్ ఓటింగ్ పూర్తిగా నాకే మొగ్గు చూపిందన్నారు. ఉమ్మడి నల్గొండ - వరంగల్ - ఖమ్మం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజారితో గెలువబోతున్నామన్నారు. పోలింగ్ జరుగుతుంటే నిబంధనలు ఉల్లంఘించి నిన్న సీఎం రేవంత్ ప్రెస్ మీట్ పెట్టారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తామన్నారు. వాళ్ళ ఓటమిని సీఎం అంగీకరించారన్నారు. ఎమ్మెల్సీగా నాకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మీ సేవ చేసుకునే అవకాశం నాకు ఇవ్వాలంటూ అభ్యర్థించారు. ఈ సమావేశంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, క్లస్టర్ ఇంఛార్జి మర్తినేనీ ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే వన్నల శ్రీరాములు, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ సమైక్యత శిబిరానికి 17 మంది ఎంపిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఎన్సీసీ ఆర్మీ పదో తెలంగాణ బెటాలియన్ నుంచి' ఏక్ భారత్ శ్రేష్ట భారత్' ఈబీఎస్బీ, జాతీయ సమైక్యత శిబిరానికి 17 మంది ఎంపికై మంగళవారం హైదరాబాదు లో జరిగే జాతీయ క్యాంపులో పాల్గొనడానికి బయలుదేరినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎన్సీసీ ఆర్మీ క్యాడేట్స్, ఎయిర్ ఫోర్స్, నేవీ, జాతి సమైక్యత కోసం, జాతి భద్రత కోసం, జాతీయ సమ్మేళనం కోసం మేమందరం భారతీయులం, మన జాతి భరత జాతి, సమైక్యస్ఫూర్తితో అన్ని రాష్ట్రాలు వారి వారి రాష్ట్రాల ప్రతిభను ఈ క్యాంపులో ప్రదర్శిస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కళాశాలకు, వరంగల్, ఎన్సీసీ గ్రూప్ కు, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరారు. జాతీయ స్థాయి శిబిరంలో జరిగే అన్ని పోటీల్లో విజేతలుగా నిలిచి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొని జట్టులో వీరు ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంస్కృతిక సమ్మేళనంలో నైపుణ్యం ఆధారంగా వీళ్లు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభావంతులకు అవకాశం కల్పించిన 10 తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్ నంద కందూరి, ఏవో రవి సుకేరే కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్యాంపు నేటి నుంచిపది రోజులు హైదరాబాదులో సీఎంఆర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో మేడ్చల్ జాతీయ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ సదానందం, సీనియర్ అండర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, జూనియర్ అండర్‌ఆఫీసర్ సంతోషి, 17మంది ఎన్సీసీ క్యాడర్స్ పాల్గొన్నారు.

## శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, చిల్పూరు :** శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామివారికి అష్టదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యనిర్వహణాధికారి బి. లక్ష్మీ ప్రసన్న, అర్చకులు బి.రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అచ్చా లక్ష్మీనారాయణకు పరామర్శ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గంలోని ఖిలా వరంగల్ 37వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అచ్చా లక్ష్మీనారాయణకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఈ విషయం తెలుసుకొని తెలుగుదేశం పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గ నాయకులుచ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్, ఠాకూర్ గణేష్ సింగ్, బజ్జూరి వీరేశం, కాంద్రాతి శ్రీకాంత్, కాంద్రాతి రాజు, అచ్చ లక్ష్మీనారాయణను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు.

# లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం

### నియంతృత్వం, మతోన్మాద శక్తులకు చోటు లేదు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికలలో వామపక్షాల మద్దతుతో పోటీ చేసిన ఇండియా కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య వాదులకు, మతోన్మాదులకు మధ్య జరిగాయన్నారు. విప్లవాలకు, వామపక్ష శక్తులకు నిలయమైన ఉమ్మడి వరంగల్ జిల్లాలో మతోన్మాదులకు చోటు లేదని ప్రజలు మరోసారి నిరూపించారని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి పట్టించుకోకుండా, యువకులకు, మహిళలకు, విద్యార్థులకు, రైతులకు ఏం చేశారో చెప్పకుండా కేవలం మతం, కులం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూసే వారికి ఈ ఎన్నికలు ఒక గుణపాఠం అని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు రావాల్సిన విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, పారిశ్రామిక కారిడార్ లాంటి హామీలు అమలు చేయకుండా బీజేపీ మోసం చేసిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ కోసం, నియంతృత్వాన్ని ఓడించాలని ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు వేల్పుల సారంగపాణి, ఏశబోయిన శ్రీనివాస్, బాషబోయిన సంతోష్, బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో చందనోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, ములుగు :** మండలంలోని మల్లంపల్లి గ్రామంలో గల హనుమాన్ దేవాలయంలో గ్రామానికి చెందిన హనుమాన్ భక్తులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎడ్ల అనిల్ రెడ్డి, మూల గణేష్ రెడ్డి మంగళవారం చందనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకులు బాదం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ హనుమాన్ భక్తులతో కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ భక్తులు ఆంజనేయస్వామికి చందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాగా, హనుమాన్ నామస్మరణతో గ్రామం మార్మోగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, కాంగ్రెస్ నాయకులు గొర్రె కుమార్, శ్యామ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ద్రోణాచారి, మొర్రి రాజు యాదవ్ పాల్గొన్నారు.

# బుర్రా రాములు ఆశయాలను కొనసాగిద్దాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేడు దేశంలో పెరుగుతున్న మతోన్మాద దాడుల పట్ల హక్కుల సంఘాల నాయకులుగా, కార్యకర్తలుగా ప్రశ్నించడమే కాక ప్రజలకు ఉండే హక్కులను కాపాడుకొనుటకు మనమంతా పనిచేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు మైసా శ్రీనివాస్, కడారి భోగేశ్వర్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్, జర్నలిస్టు ఎస్.రవి, న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజులు అన్నారు. మానవ హక్కుల వేదిక రథసారథి డాక్టర్ బుర్ర రాములు 13వ యాది సభ హెచ్ఆర్ఎఫ్ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు అధ్యక్షతన ఖిలా వరంగల్ పడమరకోట చమన్ సెంటర్ లో నిర్వహించారు. ముందుగా బుర్ర రాములు చిత్రపటానికి ఆయన సతీమణి బుర్ర స్వరూపతో పాటు హక్కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆయనను యాది చేసుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ యాది సభకు హాజరైన నాయకులు మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు ప్రజల మధ్య మతపర వైశ్యామ్యాలు రెచ్చగొట్టి హిందూ ధర్మ సంస్కృతి పేరుతో మనువాదాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నదని అన్నారు. మైనార్టీ మతస్తుల, జాతుల, దళిత, ఆదివాసీ ప్రజలపై దాడులకు ప్రేరేపించి చంపిస్తున్నదని వారు అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ల నుంచి రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకొనుటకు అందరం కలిసి పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు పాలకుర్తి సత్యనారాయణ, యాదగిరి, దిలీప్, పి శ్రీనివాస్, సాదు రాజేష్ లతో పాటు మహిళా సంఘం జిల్లా నాయకురాలు రత్నమాల, ఐఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, నలిగంటి విజయపాల్, బి ఐలయ్య ప్రజా కళాకారులు బికే, చంద్రమౌళి, మైదం సంజీవ, రాములు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు పూర్తి



## జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి

**వరంగల్ వాయిస్, ములుగు :** స్ట్రాంగ్ రూమ్ లకు ఈవీఎంల తరలింపు ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించిన ఈవీఎంను ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచిమహబూబాబాద్ జిల్లా కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్ కు తరలింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను మంగళవారం ఉదయం ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మహబూబాబాద్ జిల్లా కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపరిచామని కలెక్టర్ తెలిపారు. ఈవీఎం యంత్రాలు స్ట్రాంగ్ రూంకు తరలింపు ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరిగిందని, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా యంత్రాలను తరలించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కే. సత్య పాల్ రెడ్డి, కార్యాలయ పరిపాలన అధికారి రాజ్ కుమార్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో విజయం ఖాయం

## బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** లోక్ సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరో సారి విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత దీమా వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, సత్యవతి రాథోడ్ లతో కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో పోలైన ఓట్లు బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా పడ్డాయని, నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, వంద రోజులలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో కాంగ్రెస్ పై ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టనున్నాయన్నారు. పెద్ద ఎత్తున కౌంటింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేసిన వారందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెల్వరాజ్ మృతి కార్మిక, కర్షక ఉద్యమాలకు తీరని లోటు

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐ నాయకుడు, తమిళనాడులోని నాగపట్టిణం పార్లమెంట్ సభ్యుడు, కామ్రేడ్ ఎం.సెల్వరాజ్ అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. నాలుగు సార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికై పార్లమెంటులో రైతు కూలీల, అన్ని వర్గాల ప్రజల వాణిని వినిపించిన నిస్వార్థప్రజానాయకుడు సెల్వరాజ్ కు జోహార్లు అర్పించారు. పేదలకు సాగు భూముల కోసం, ఇళ్ల స్థలాల కోసం, వ్యవసాయ కార్మిక సంక్షేమ పథకాల కోసం అనేక పోరాటాలకు వారు నాయకత్వం వహించారు. తమిళనాడులో బలోపేతమైన వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని నిర్మించారు. 2019లో నాగపట్టిణంలో ఘనంగా నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత జాతీయ సమావేశాలలో ఆహ్వాన సంఘ అధ్యక్షుడిగా సెల్వరాజ్ చేసిన ప్రసంగం దేశ నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులను ఎంతగానో ఉత్తేజపరిచింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన సెల్వరాజ్ విద్యార్థి దశలోనే సామ్యవాద సిద్ధాంతవైపు ఆకర్షితులై విద్యార్థి, యువజన, కార్మిక కర్షక ఉద్యమాలలో పాల్గొని అంచెలంచలుగా ఎదిగి కుల, మతాలకు అతీతంగా సమాజ అభివృద్ధి కోసం కృషిచేసి గొప్ప పార్లమెంటేరియన్ గా పేరు తెచ్చుకున్నారన్నారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని వెంకట్రాములు నేటి యువతరానికి విజ్ఞప్తి చేశారు.

# దత్త వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి



**వరంగల్ వాయిస్, కాటారం :** మంథని నియోజక వర్గంలోని కాటారం మండలం ధన్వాడ గ్రామంలో శ్రీ దత్తాత్రేయ, శివపార్వతి, గణపతి, ఆదిత్య నందికేశ్వర భక్తాంజనేయ ఆలయ 3వ వార్షికోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విచ్చేశారు. ఈ సందర్భంగా భట్టికి దుద్దిల్ల శ్రీను బాబు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వగ్రామం ధన్వాడలో దత్త గుడి వార్షికోత్సవం వేడుకలకు భట్టి హాజరయ్యారు. మంథని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గానికి విచ్చేసిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు శాలువాతో సత్కరించి శ్రీను బాబు ఘన స్వాగతం పలికారు. మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మదర్స్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలోని రెడ్డి గార్డెన్ లో డబ్ల్యూఈటీఏ సంస్థ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు ఆ సంస్థ ఫౌండర్, పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. మాతృదినోత్సవ వేడుకల సందర్భంగా మాతృమూర్తులందరికి సన్మాన కార్యక్రమం నిర్వహించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని, డబ్ల్యూఈటీఏ ఫౌండర్ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మలందరిని ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. డబ్ల్యూఈటీఏ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలు చేశాం, పాలకుర్తి నియోజకవర్గంలో కూడా సేవలు చేస్తున్నామని గుర్తు చేశారు. గ్రీస్ లో రియా అనే దేవతను మదర్ ఆఫ్ గాడ్స్ గా భావించి ఏడాదికొసరి నివాళి అర్పించేవారు. 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్ లో తల్లులకు గౌరవంగా మదరింగ్ సండే పేరిట ఉత్సవాన్ని జరిపేవారని గుర్తు చేశారు. 1872 లో జులియవర్డ్ హెవే అనే మహిళ అమెరికాలో తొలిసారిగా ప్రపంచ శాంతికోసం మదర్స్ డే నిర్వహించాలని ప్రతిపాదించారు. అదేవిదంగా అన్న మేరీ జర్విస్ అనే మహిళ మదర్స్ ఫ్రెండ్ షిప్ డే జరిపేందుకు ఎంతో కృషిచేసింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళలు, అమ్మలు, అమ్మమ్మలు, తదితరులు, పాల్గొన్నారు..

# ఆర్డీఎఫ్‌లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభం

**వరంగల్ వాయిస్, కల్లెడ :** ఆర్డీఎఫ్ వనిత అచ్యుత పాయ్ విద్యాలయ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి వృత్తివిద్యా కోర్సులు ప్రారంభించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎ. జనార్దన్ తెలిపారు. కోర్సులు MLT, MPHW /ANM (F, ET& CSE కోర్సులను ఈవిద్యాసంవత్సరం నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఎస్సెస్సీ పాస్, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ కోర్సులను అప్లై చేసుకున్న వచ్చన్నారు. ఈ కోర్సుల వ్యవధి రెండు సంవత్సరాలు ఉంటుంది. ఎంఎల్‌టీ పూర్తయిన విద్యార్థులు సొంతంగా ల్యాబ్ స్థాపించి స్వయం ఉపాధి పొందవచ్చని, గవర్నమెంట్, మెడికల్ కాలేజీ, కార్పొరేట్ హాస్పిటల్ , డెంటల్ కాలేజీ, క్లినికల్ ల్యాబ్ లలో ఉద్యోగం పొందవచ్చునని తెలిపారు. ఎంపీహెచ్ డబ్ల్యూ/ ఏఎన్ఎం (మహిళ) పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్లలో నర్సు ఉద్యోగం పొందవచ్చునని, బీఎస్సీ నర్సింగ్ కుడా పూర్తి చేయవచ్చునని పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ సదవకాశన్ని ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్నీ వివరాలకు 9949383450, 9959301913నెంబర్లలోసంప్రదించవచ్చని తెలిపారు.

# అధికారంలోకి వచ్చేది ఇండియా కూటమే

## కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని మహబూబాబాద్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని, నిరుద్యోగ సమస్య తీరుతుందని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన అన్నింటిని అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ఓటరు మహాశయులందరికీ పాదాభివందనాలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రామచంద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాటసారులకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని కాశిబుగ్గ లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద మంగళవారం బండారి రాజేశ్వర్ రావు శ్రీ లక్ష్మీ దంపతుల కుమార్తె బండారి శైనిత పుట్టినరోజు సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వంగరి రాంప్రసాద్ మాట్లాడుతూ 30 రోజులుగా బాటసారిలకు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసే కార్యక్రమం మా సంఘం చేపట్టిందని దాతలు ముందుకు రావడం అభినందనీయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, కోశాధికారి దుస్సా కృష్ణ, కార్యవర్గ సభ్యులు గాజుల రాజేష్, ములుక సురేష్, సిందం కృష్ణ, సభ్యులు బండారి శ్రీనివాస్, కోట నగేష్, బండారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు

## హాజరైన మారెపల్లి సుధీర్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హనుమకొండ జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం వారిచే నిర్వహించిన కార్యక్రమానికి వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, హనుకొండ జిల్లా జడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సుధీర్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. సుధీర్ కుమార్ భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డిస్తూ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నాగవెల్లి సురేష్, ఉపాధ్యక్షుడు కురిమెల్లి రమేష్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న టౌన్ సీఐ దేవేందర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి సమీపంలో ఓ ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళుతున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తన వాహనం ఆపి బాధితుడిని ఎక్కించుకుని జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ వీధిలో నివాసముంటున్న జానిమియా తన ద్విచక్రవాహనంపై పాతబజారుకు పని నిమిత్తం వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో అండర్ బ్రిడ్జిలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆటుగా వస్తున్న సీఐ పెండ్యాల దేవేందర్ ఇది గమనించి వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా పలువురు సీఐని అభినందించారు.

# బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కరీమాబాద్‌కు చెందిన జర్నలిస్ట్ కమటం వేణుగోపాల్ ఈనెల 13న అర్ధరాత్రి ఒంటి గంటలకు ఎన్నికల విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో సాకరాశికుంటు మహరాజుల కాలనీ గల్లీలో సైరన్ వేస్తూ అనుమానస్పదంగా ఉన్న ఒక ప్రైవేటు వాహనం ( టీఎస్ 03 ఈక్యూ 3816 ) నంబర్ గల కనిపించింది. తను దానిని సెల్ ఫోన్ లో చిత్రీకరించే ప్రయత్నం చేస్తుండగా ఆ వాహనంలో ఉన్న నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఒకరు పోలీస్ డిపార్ట్మెంట్ అని, మరోకరు ప్రెస్ అంటూ తన మీదికి దాడికి దిగి సెల్ ఫోన్ లాక్కొని బెదిరించారు. అంతేకాకుండా తన ఐడీ కార్డు చూపించమని దౌర్జన్యం చేశారు. నానా బూతులు తిడుతూ నీ ఇల్లు ఎక్కడా.. నీ అంతుచూస్తామని అంటూ బెదిరిస్తుండగా స్థానికులు అక్కడకు వచ్చి ఏంటీ గోడవ అని ప్రశ్నించడంతో వాహనంలో పారిపోయారు. ఆ వాహనం వెనుక జీఎండబ్ల్యూఎంసీ కార్పొరేటర్ అని రాసి ఉంది. ఆ వాహనానికి సంబంధించిన ఫొటోస్ వీడియోలు తన దగ్గర ఉన్నాయని, కాబట్టి తనపై దాడికి, దౌర్జన్యానికి దిగిన వ్యక్తులను పట్టుకొని చట్టరీత్య చర్యలు తీసుకోవాలని మంగళవారం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో కమటం వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



**వరంగల్ వాయిస్, ఖానాపూర్ :** మండలంలోని బుధరావుపేట్, ఖానాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా సహకార అధికారి తనిఖీ చేశారు. మొన్న కురిసిన ఆకల వర్షాల వలన సెంటర్ లోని రెండు లారీ లో లోడ్ చేసిన కొన్ని ధాన్యం బస్తాలు తడిసినట్లు గుర్తించారు. వెంటనే అవి దగ్గరలోని బాయిల్డ్ మిల్ కు తరలించడం జరిగింది. అలానే చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ కొనుగోలు కేంద్రం దగ్గర లో రైతులు ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోవడం జరిగిందని పత్రికలో రావడం జరిగిందని, అక్కడికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ తడిసిన ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశంలో ఆరబెట్టారని, ఈ ధాన్యాన్ని వెంటనే దగ్గర లోని బాయిల్డ్ మిల్ కి తరలించమని చెప్పారు. అలాగే రైతులకు, సెంటర్ ఇంచార్జిలకు ధాన్యం ఎత్తైన స్థలంలో అరబోయాలని తెలియజేశారు. సెంటర్ ఇంచార్జిలకు ధాన్యం తడువకుండా టార్పాలిన్ కవర్లతో కప్పవలసిందిగా ఆదేశించారు. అలాగే, సెంటర్ ఇంచార్జిలకు ట్యాబ్ లో సకాలంలో నమోదు చేయవలసిందిగా, సెంటర్ నిర్వాహకులు రైస్ మిల్లర్ల దగ్గరి నుంచి రశీదు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి ఒత్తిడి లేదా ప్రలోభాలకు లొంగకుండా కేవలం నాణ్యమైన ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది. వరి కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు, సరిపడు హమాలీలను ఉండేటట్లు చూసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరుకు వరంగల్ జిల్లాలో యాసంగి 2023-24 వరి ధాన్యం కేంద్రాల ద్వారా 30489.840 ఎంటీఎస్ లను కొనుగులు చేయడం జరిగింది. (6142) మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. ఆ ధాన్యం విలువ రూ. 67.11కోట్లు, ఇప్పటి వరకు రైతుల ఖాతాలో రూ. 41.51 కోట్లు జమ చేయడం జరిగాయని జిల్లా అదనపు కలెక్టర్ (పౌ.స) వరంగల్ తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్లలో, రైతులకు ఏమైనా ఇబ్బందుల ఉన్నచో, కాల్ సెంటర్ నెంబరు 7995050785 ని సంప్రదించవలసినదిగా కోరారు. ఆ నంబరును అన్ని వరి కొనుగోలు కేంద్రాలలో ప్రదర్శించవలసినదిగా కోరారు.

# అందరి సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు

## ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 69.66 శాతం పోలింగ్ నమోదు

## జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** అధికారులు, సిబ్బంది, రాజకీయ నాయకులు, ప్రజలు అందరి సహకారంతో లోక్ సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, మహబూబాబాద్ ఎస్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ములుగు శాసనసభ నియోజకవర్గంలో 69.66 శాతం పోలింగ్ జరిగినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి తెలిపారు. ఏజెన్సీ, తీవ్రవాద ప్రభావిత ప్రాంతమైన మన జిల్లాలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరిగినట్లు తెలిపారు. మొత్తం 2,33,191 మంది ఓటర్లకు గాను 1,62,443 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఓటింగ్ లో పాల్గొన్న వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 83,337 ఉండగా, పురుష ఓటర్లు 79,097 మంది, ఇతరులు 09 మంది ఓటు వేశారని అన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో 65.94 శాతం పోలింగ్ నమోదు గాక, ఈ ఎన్నికల్లో 69.66 శాతం నమోదు అయినట్లు తెలిపారు. ములుగు నియోజకవర్గం పరిధిలో ప్రశాంత వాతావరణం నడుమ సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియ సక్రమంగా, సజావుగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన ఓటర్లకు, ప్రజలకు భాగస్వాములైన అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులను అభినందించారు.

# లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలకు కృతజ్ఞతలు

## కాంగ్రెస్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ సోమవారం జరిగిన లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ లోక్ సభ, తెలంగాణ రాష్ట్ర పరిధిలో గల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అనుబంధ సంఘాల అధ్యక్షులకు, జిల్లా ప్రజాప్రతినిధులకు, మండల అధ్యక్షులకు, మండల ప్రజా ప్రతినిధులకు, గ్రామ అధ్యక్షులకు, గ్రామ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, పోలీసు అధికారులకు, ప్రతి శాఖల ఉన్నత అధికారులకు, ముఖ్యంగా వరంగల్ పార్లమెంట్ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ మొత్తంలో కాంగ్రెస్ దాదాపు 14 సీట్లు గెలవడం ఖాయన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తథ్యం అంటూ చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి కావడం ఖాయమని డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల ధీమా వ్యక్తం చేశారు.

# డ్రంకెన్ డ్రైవ్‌లో 11మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ నలుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 4000 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 11 మందికి రూ.18,200 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ పీఎస్ ఇన్ స్పెక్టర్ తెలిపారు.

# బతుకుదెరువుకు వలసొచ్చిన యువతి మృత్యువాత



**వరంగల్ వాయిస్, రేగొండ :** బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రదేశ్ నుంచి వలస వచ్చి పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం గడుపుతున్న యువతి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన సంఘటన మండలంలోని రేపాకలో జరిగింది. సంఘటన వివరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం మదన్ కుమార్ - రుతు దంపతులు గత రెండు సంవత్సరాల కింద రేగొండ మండలంలోని రేపాకకు వలసకు వచ్చి కూలినాలీ చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో యువతి రుతు అనారోగ్యంతో బాధపడుతుండేదన్నారు. ఈ నేపథ్యంలో భర్త మదన్ కుమార్ మే 13న జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వెళ్లారని, ఈ సమయంలో యువతి అనారోగ్యంతో బాధపడుతుండగా గ్రామస్తులు అంబులెన్స్ కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరకాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. యువతి రుతి విషయం పోలీసులకు సమాచారం అందిచగా, సాధారణ మృతిగా భావించడంతో గ్రామస్తులు ఓటు కోసం వెళ్లిన భర్త రాక కోసం ఎదురుచూస్తూ గ్రామస్తులు, యువకులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 14, మే 2024
www.warangalvoice.net

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు విజ్ఞతతో ఓటేయండి



## ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి మంగళవారం వరంగల్ లోని రీజనల్ లైబ్రరీ, సెంట్రల్ లైబ్రరీలను సందర్శించి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పట్టభద్రులను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా సెంట్రల్ లైబ్రరీ లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అత్యంత సామాన్య కుటుంబం నుండి వచ్చిన నాకు విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యలు తెలుసన్నారు. జీవో 46 రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ హామీని నెరవేర్చేదాక విద్యార్థుల పక్షాన యుద్ధం చేస్తానని అన్నారు. విద్యార్థి నిరుద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై పోరాడుతూనే పరిష్కారం దిశగా కృషి



చేస్తానని, రాబోయే వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. హనుమకొండ లోని ఎల్ఐసీ, కార్యాలయం పోస్టాఫీసు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉద్యోగులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరడం జరిగింది. పట్టభద్రులు విజ్ఞతతో ఓటు వేస్తారని ధీమా వ్యక్తంచేశారు. గతంలో ఎమ్మెల్సీగా ఒక చుక్కా రామయ్యను, ఎల్ఎస్ రాజును, ప్రొఫెసర్ నాగేశ్వర్ ను, రాజేశ్వర్ రావు, దిలీప్ కుమార్, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు అయ్యారని, ఈ తీర్పులు చూస్తే గ్రాడ్యుయేట్ లు ఎవరిని కోరుకుంటున్నారో స్పష్టమౌతుందని అన్నారు. అధికార పార్టీ అభ్యర్థి గెలిపిస్తే అభ్యర్థికే ఉపయోగం ఉంటుంది. ఆయనకు నిరుద్యోగుల గురించి మాట్లాడేంత ఉందా, ప్రభుత్వాన్ని నిలదీస్తాడా అని అన్నారు. ఉద్యోగాల గురించి నిలదీసే అడిగే ఛాన్స్ ఉండదు, నేను వారితో మమేకమైన వ్యక్తిగా తెలుగుకోగలనన్నారు. ప్రతిపక్ష అభ్యర్థిని గెలిపిస్తే ఖచ్చితంగా అధికార పార్టీని నిలదీస్తాడని తెలిపారు. ప్రజల్లో ఉండే వ్యక్తిని గెలిపించాలి. తప్ప నాలుగు గోడల మధ్య ఉండి. స్క్రీన్ చదివే వాళ్లను గ్రాడ్యుయేట్ లు అర్హుడిగా భావించరని, వారికి నీళ్లేదో పాలేదో తెలుసునని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలతో పోలిస్తే ప్రత్యేకమైన ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నటువంటిది. ఎందుకంటే, ఇందులో కేవలం విద్యావంతులు, గ్రాడ్యుయేట్స్, మేధావులు మాత్రమే ఓట్లు వేస్తారు. వాళ్లకు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనేటువంటి అర్హత ఉంది కాబట్టి, తప్పకుండా ఒక విచక్షణతో ఓటేస్తారని భావిస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ రవి నాయక్, టీఆర్ఎస్వీ కొమురన్న, జెట్టి రాజేందర్, పిన్నింటి విజయ్ లు తదితరులు ఉన్నారు.

# వారణాసిలో మోడీ నామినేషన్


**వరుసగా మూడోసారి ఇక్కడినుంచే పోటీ**
**కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా, సీఎం యోగి**
**ఎన్డీఏ నుంచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హాజరు**

**వరంగల్ వాయిస్, వారణాసి :** సార్వత్రిక ఎన్నికల పోరులో భాగంగా ప్రధాని మోదీ మంగళవారం తన సిట్టింగ్ నియోజకవర్గం వారణాసి నుంచి నామినేషన్ వేశారు. కీలక ఎన్డీఏ నేతలు వెంట రాగా, ఉదయం జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ స్థానం నుంచి ప్రధాని వరుసగా మూడోసారి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. నామినేషన్ కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ నేతలు పాల్గొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు మోదీ వెంట రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. దీనికి ముందు కాశీలోని దశాశ్వమేధ ఘాట్ వద్ద ప్రధాని పూజలు నిర్వహించారు. అక్కడే క్రూజ్ షిప్‌లో పర్యటించారు. కాలభైరవ ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం యోగితో కలిసి మోదీ.. ఆరు కిలోమీటర్ల మేర భారీ రోడ్‌షో నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం కాశీ విశ్వనాథుడి ఆలయంలో పూజలు చేశారు. రాత్రి ఇక్కడే బస చేశారు. నామినేషన్ నిమిత్తం మోదీ పర్యటన ఏర్పాట్లను హోంశాఖ మంత్రి అమిత్‌షా, సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఆ పార్టీ సీనియర్ నేత సునీల్ బన్సల్ చాలా రోజుల నుంచి వారణాసిలో ఉండి పనులను చక్కబెట్టారు. ఇక, ఈ రోజు ఉదయం మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ఎమోషనల్ వీడియోను షేర్ చేశారు. కాశీతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఏడో విడతలో జూన్ ఒకటిన ఈ స్థానానికి పోలింగ్ జరగనుండగా.. నామినేషన్ దాఖలు చేయడానికి గడువు నేటితో ముగియనుంది. ఇక్కడ ప్రధానిపై కాంగ్రెస్ నుంచి యూపీ రాష్ట్ర పార్టీ శాఖ అధ్యక్షుడు అజయ్‌రాయ్ నిలబడిన సంగతి తెలిసిందే. మోదీపై ఈయన పోటీ



చేయడం వరుసగా మూడోసారి కావడం గమనార్హం. 2014లో ప్రధాని తొలిసారి ఇక్కడ పోటీ చేయగా.. 56శాతం ఓట్లతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజయ్ రాయ్‌కి కేవలం 75వేల ఓట్లు దక్కాయి. ఆమ్ ఆద్మీ తరఫున అరవింద్ కేజ్రీవాల్ రెండో స్థానంలో నిలిచారు. ఇక, 2019 ఎన్నికల్లో ప్రధానికి 63 శాతం ఓట్లు రాగా.. అజయ్‌రాయ్‌కి 14శాతం ఓట్లు దక్కాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి లోక్ సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. వరసగా మూడోసారి ఇక్కడి నుంచి మోదీ బరిలోకి దిగారు. 2019, 2014లో కూడా వారణాసి నుంచి మోదీ పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే. నామినేషన్ వేసిన తర్వాత రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ కార్యకర్తలతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. వారణాసిలో లోక్‌సభ అభ్యర్థిగా మరోసారి పోటీచేస్తున్న నరేంద్ర మోదీ ఆరు కిలోమీటర్ల మేర పట్టణంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. విద్యా రంగ సంస్కర్త మదన్‌మోహన్ మాలవీయా విగ్రహానికి పూలమాల సమర్పించి యాత్రను ప్రారంభించారు. రోడ్‌షోలో ఆయన వెంట యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ ఉన్నారు. ప్రధానమంత్రికి ఆహ్వానం పలుకుతూ, కనీసం వంద చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటుచేశారు. కాషాయ దుస్తులు ధరించిన మహిళలు రోడ్డుకు అటు ఇటు పెద్దఎత్తున గుమిగూడి రోడ్‌షోకు స్వాగతం పలికారు. నరేంద్రమోదీపై పూలవర్షం కురిపించారు.

# తెలంగాణకు కేసీఆర్ ఒక నిన్న



తెలంగాణ రాష్ట్ర సమితి కనుమరుగు జాతీయ స్థాయిలో, దేశ వ్యాప్తంగా తప్పుడు సంకేతం. జాతీయ సంకీర్ణ ప్రయోగాలకు ఒక గొడ్డలి పెట్టు. ఏదైనా ఒక ప్రాంతంలో ఒక క్షేత్రీయ పార్టీ బలపడి, తనను తాను అనేక ఆటుపోట్లతో, భారీ విజయాలతో పెంచుకొని, విస్తారమైన ఆర్థిక, భవన సంపదలతో ఎదిగిన తర్వాత, ఇంత ఘోరంగా విఫలం కావడం తాజాగా బీఆర్ఎస్ నే అని చెప్పొచ్చు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో చరిత్రాత్మక పాత్ర కలిగి, కొత్త రాష్ట్రాన్ని అనేక రంగాలలో అగ్ర భాగాన నిలిపిన పరిపాలకుడిగా భూమిక సాధించిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్థాపించి, పేరు మార్చి, అధోగతి పాలు చేసిన పార్టీ వల్ల, దేశంలోనే ప్రాంతీయ రాజకీయ పార్టీల ఉత్థాన, పతనాల చరిత్రలో గుగుర్పాటు కలిగింది. విద్యార్థి ఉద్యమంతో అడుగిడి, ప్రాంతీయ పార్టీగా ప్రపంచ ఆలోచనాపరుల దృష్టిని ఆకర్షించి, కను మరుగైన ప్రఫుల్ల కుమార్ మహంతా, ఆయన అస్సాం గణ పరిషత్ తర్వాత అంతటి ఉనికి సమస్యను కేసీఆర్, ఆయన మాజీ తెరాస, తాజా భారత రాష్ట్ర సమితి పార్టీ ఎదుర్కొంటుంది. ఆయన యువజన కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచి పాత్రికేయుడిగా, 2022 అక్టోబర్ లో తన పిలుపు మేరకు, గడపలోకి అడుగెట్టి, నిన్నమొన్నటిదాకా అక్కడే నిలుచున్న యోధుడిగా, రాజకీయవేత్తగా కేసీఆర్ ను నిశితంగా గమనించిన వ్యక్తి గా నా పరిశీలన. పార్టీ పుట్టడం, పెరగడం, ఉనికిని సంతరించుకోవడం, ఇంతగా చరిత్ర సృష్టించడంలో ఆయనతో పాటు వేలాది మంది త్యాగాలు, లక్షలాది మంది కాయకష్టం ఉంటుంది. వారందరిపట్ల సానుభూతితో, దేశ రాజకీయ చిత్రంలో ఆ పార్టీ చోటు ఛిద్రమవుతున్నందుకు ఒకింత విచారం. మొన్న లోక్ సభ ఎన్నికల ప్రచారం ముగిస్తూ, ప్రధాన మంత్రి పదవికి పోటీదారునని కేసీఆర్ చేసిన ప్రస్తావన. కేవలం ఊహ కోసం తెలంగాణలో 15 లోక్‌సభ స్థానాల్లో కేసీఆర్ పార్టీ గెలుస్తుందని అనుకుంటే, 300 స్థానాలు కలిగిన పార్టీనో, కూటమో నిలిపే వ్యక్తి ఆ పదవిని పొందగలుగుతాడు. ఇప్పుడు మూడు చోట్ల గెలుస్తారా అంటే, నమ్మకం చెప్పలేని పరిస్థితి. మూడు గెలిస్తే ఒక్క శాతం, ఆయన చెప్పే అద్భుతం జరిగి 15 గెలిస్తే 5 శాతం సంఖ్యా బలంతో ఏం చేయగలడు. అందుకే, అది విన్న కొందరు చైతన్యవంతులు ఆయన తీరు మారలేదని, వేరే వైపు ఓటు మళ్లించారు. జాతీయ రాజకీయాల్లో ఆయనను మూడో వ్యక్తి నమ్మే పరిస్థితి లేదని, ఆయనకు కూడా తెలుసు. ఎందుకీ ప్రగల్భాలు, పగటి కలలు. పక్క రాష్ట్రం ముచ్చట మాటిమాటికి తనకు ఎందుకు? ఆంధ్ర ఫలితాలు చూసుకోవడానికి కేసీఆర్ అవసరమని అక్కడ ఎవరూ అనుకోనప్పుడు, తగుదునమ్మా అని అక్కడి మంత్రసానితనమెందుకు? ఫలితంగా ఆ రాష్ట్రం అధికారం కోసం తహతహలాడుతున్న కులాల వారు, వారి సానుభూతిపరులు తెలంగాణలో ఆయనను శత్రువుగా నిర్ధారించారు. వేరే పార్టీల శాసన సభ్యుల జట్టుచేసుకోవడం, వచ్చిన ఉప ఎన్నికలను ఉపద్రవాలుగా మార్చి, తప్పుడు సంప్రదాయాలకు, విపరీత ఆర్థిక విచ్చలవిడితనానికి, ఓటర్లలో భ్రాంతికి దారితీశారు. బలుపు ప్రయోగాలు పెరిగి, భావోద్వేగం అడుగంటింది. ఉద్యమ, ప్రాంతీయ భావోద్వేగానికి కేసీఆర్ రవ్వంత విలువ మిగల్చకపోవడం, తెలంగాణ సబ్బండ వర్గాల సకల జనులకు మానసిక వేదన మిగిల్చింది. కాళేశ్వరం సమగ్ర గోదావరి బహుళార్థ సాధక ప్రాజెక్టు అనే దాని విశ్వరూపాన్ని, మేడిగడ్డ బ్యారేజీ మూడు స్తంభాలు కుంగే వరకు, జనం మదిలో నింపలేదు. ఓడిపోయినా చిలుకపలుకులు జనానికి చేరేలోపు, పుణ్యకాలం గడిచింది. తాగునీటి భగీరథ యత్నంలో ఇమిడి ఉన్న విలువ ఆ నీటిని తాగుతున్న వారికి అర్థం చేయించే ప్రయత్నమే జరగలేదు. నిరంతర విద్యుత్ సరఫరా లోతుపాతులను వినియోగదారులకు అర్థమయ్యేలా ఎన్నడూ చేయలేదు. రైతుబంధు సముచిత పరిమితి ఏర్పరచక, విచ్చలవిడితనం మేలుకన్నా కీడే చేసింది. విమర్శ పట్ల అసహనం, విభేదిస్తున్నవారి పట్ల నిఘా, ఓర్పుతో సామాన్య ప్రజానీకం మధ్యకు అప్పుడప్పుడు చేయకపోవడం వెళ్లే ప్రయత్నం క్రమంగా ముళ్ల కంచెలుగా మారాయి. తిరగబడినవారిని పెట్టిన ముప్పుతిప్పలు జనానికి అసహనం కలిగించింది. కేసీఆర్ శత్రు భయంకరుడు. పథకాల అమలు పర్యవసాలు ఆలోచించని ఆడంబరం పెనుశాపమయింది. సొంత పార్టీలోని తాము పరాయిలమనే భావించే పరిస్థితి. అంతా తానే. అంతా తనదే అనే భ్రమ, ప్రగతి భవన్ నుంచి ఎంతో వికారంగా ముఖం దాచుకుని వెళ్లే నికృష్ట స్థితి. తెలంగాణ లో అధికార మార్పిడి తర్వాత కేసీఆర్ అన్నీ బాగానే చేశారని, ఆయన చేసినంతగా కొత్తగా వచ్చినవాళ్లు చేయలేకపోతున్నారని ఆవేదన నిజమే. కానీ, అవన్నీ తీర్చడానికి మళ్లీ కేసీఆర్ కావాలనే స్థితికి జనం రాలేరు. ఎందుకంటే, పెట్టిపొయ్యకపోయినా, పెయ్యలకు పునికి చూసే ఉదారత కావాలి. జంతువు ఈనిన తర్వాత పుట్టిన దూడ సరిగా దగ్గరికి రాకపోతే, అరే! ఇది ఈన నేర్చింది కానీ, నాక నేర్వలేదు, అంటారు. కేసీఆర్ పరిస్థితి అదే. అందుకే ఆయన అధికారం కోల్పోయినా, తుంటి విరిగి మంచం పాలయినా,అంతకుముందు ఆయన వద్ద అన్నీ అనుభవించిన వారు వరదలా దూరమయినా, ప్రజల్లో కదలిక లేదు. దాంతో ఆయన రాజకీయ నిర్మాణం నిరర్థకమైంది. తెలంగాణలో ప్రాంతీయ పార్టీల స్థావరం జాతీయ పార్టీల పరం కావడం దేశ రాజకీయాలలోనే సంచలన పరిణామం.

**రాపోలు ఆనంద భాస్కర్**
**మాజీ ఎంపీ, సీనియర్ పాత్రికేయుడు**

# అంతా ఓటేయడానికి వెళ్లారా

## ఎవరు గెలిస్తే నాకేంటి అంటున్న నాగ్ అశ్విన్



ప్రభాస్ హీరోగా దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న భారీ బ్జడెట్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ సినిమా నిర్మాత స్వప్నదత్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ సరదా పోస్ట్‌లు పెడుతుంటారు. తాజాగా 'కరెంట్ ఎఫైర్స్ ఆఫ్ వైజయంతి' అంటూ నాగ్ అశ్విన్‌కు తనకు మధ్య జరిగిన సరదా సంభాషణను ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. 'కల్కి' సీజీ వర్క్ చేస్తున్న వారంతా ఓటువేయడానికి హైదరాబాద్ నుంచి వాళ్ల ఊర్లకు వెళ్లారు ఇప్పుడెలా' అని నాగ్ అశ్విన్ అనగా.. 'ఎవరు గెలుస్తారేంటి' అని స్వప్న అడిగారు. దానికి ఆయన సరదాగా బదులిస్తూ..'ఎవరు గెలిస్తే నాకెందుకండీ.. నా సీజీ షాట్స్ ఎప్పుడు వస్తాయో అని నేను ఎదురుచూస్తున్నా' అన్నారు. దీంతో 'కల్కి' గ్రాఫిక్స్ వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు అర్థమవుతోంది. మరోవైపు ఈ చిత్రాన్ని జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈలోగా వర్క్ అంతా పూర్తి చేయాలని మూవీ యూనిట్ ప్రయత్నిస్తుంది. భారీ బడ్జెట్‌తో సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ఇది తెరకెక్కుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్ర నటీనటులు భాగం కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్‌కు జోడిగా దీపికా పదుకొణె నటిస్తుండగా.. దిశా పటానీ, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీని కాన్సెప్ట్ గురించి దర్శకుడు ఒక సందర్భంలో మాట్లాడుతూ..'మహాభారతంతో మొదలై.. క్రీస్తుశకం 2898లో పూర్తయ్యే కథ ఇది. మొత్తం ఆరు వేల ఏళ్ల వ్యవధిలో ఈ కథ విస్తరించి ఉంటుంది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన కథ కాబట్టి అందుకు తగ్గట్టుగా ఆయా ప్రపంచాల్ని సృష్టించడానికి ప్రయత్నించాం' అన్నారు.



# ఆ లోటును తీర్చడానికే..

## పూజ సరికొత్త ప్రయాణం

దక్షిణాదితోపాటు.. ఇటు బాలీవుడ్‌లోనూ ఇప్పటికే తానెంటో నిరూపించుకుంది కథానాయిక పూజా హెగ్డే. గతేడాది 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' చిత్రంతోనే సరిపెట్టుకున్న ఈ భామ.. ఇప్పుడు ఆ లోటును తీర్చడానికి వరుస సినిమాలతో తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది. ఆమె, అహాన్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'సంకీ'. అద్నాన్ షేక్, యాసిర్ ఝా సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. 'ఈ సినిమాతో పూజా హెగ్డే సరికొత్త ప్రయాణం ఆరంభం కానుంది. జూన్‌లో ఈ సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు. ఇందులో భాగంగా ఈ సినిమాకు కీలకమైన యాక్షన్ సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. దీని కోసం ముంబయిలో భారీ బ్జడెట్‌తో సెట్‌ను సిద్ధం చేసింది చిత్రబృందం. ఇందులో అహాన్, పూజ మధ్య కెమిస్ట్రీ సినిమాకే ప్రధాన ఆకర్షణగా ఉండబోతుంద'ని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రేమకథా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.




# బాహుబలి..యానిమేటెడ్ సీరిస్

## ప్రత్యేక వీడియో సందేశం ఇచ్చిన రాజమౌళి



భారత సినిమా స్థాయిని పెంచిన 'బాహుబలి' తాజాగా యానిమేటెడ్ సిరీస్‌గా ఓటీటీ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. మే 17 నుంచి డిస్నీహాట్‌స్టార్ వేదికగా ఇది ప్రసారం కానుంది. ఈ సందర్భంగా రాజమౌళిఇన్‌స్టా వేదికగా ఓ ప్రత్యేక వీడియో విడుదల చేసి అభిమానులకు సందేశమిచ్చారు.'బాహుబలి సిరీస్‌ను ఇంకా కొనసాగించండి అని ఎన్నోమంది అభిమానులు అడిగారు. వారందరి కోసం 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్'ని రూపొందించడం చాలా సంతోషంగా ఉంది. ది లెజెండ్ ఆఫ్ హనుమాన్‌కు పనిచేసిన గ్రాఫిక్ ఇండియాతో కలిసి దీన్ని రూపొందించాం. 9 ఎపిసోడ్‌లతో ఈ సిరీస్ మీ ముందుకు వస్తోంది. అందరూ చూసి ఎంజాయ్ చేయండి. మీ అందరికీ ఇది నచ్చుతుందని ఆశిస్తున్నా' అని చెప్పారు. ఈ సిరీస్ తెలుగుతో పాటు మరో ఆరు భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఇక ఇటీవల మీడియా సమావేశంలో రాజమౌళి ఈ సిరీస్ గురించి మాట్లాడుతూ.. 'బాహుబలిని థియేటర్‌లో దాదాపు 10 కోట్ల మంది మాత్రమే చూశారు. మిగతా వాళ్లు టెలివిజన్, ఓటీటీలో చూసి ఉంటారు. ప్రతిఒక్కరూ సినిమాను ఏదో ఒక మాధ్యమం ద్వారా చూస్తారు. అందరూ రెగ్యులర్ సినిమాలు మాత్రమే చూడరు. కేవలం యానిమేషన్ మూవీలను మాత్రమే ఆస్వాదించే వాళ్లూ ఉంటారు. ఆ ఆలోచనతోనే బాహుబలి యానిమేటెడ్ సిరీస్‌ను తీసుకొస్తున్నాం' అని అన్నారు.ప్రస్తుతం రాజమౌళి.. మహేశ్ బాబు ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దీనికి 'మహారాజ్' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు టాక్. వెండితెరపై సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపించనున్నారు. ఆ పాత్ర కోసం ఆయన సన్నద్ధమవుతున్నారు. మహేశ్‌కు సంబంధించి మొత్తం ఎనిమిది లుక్స్‌ను జక్కన్న టీమ్ రెడీ చేసినట్లు టాక్.



## నెట్‌ఫ్లిక్స్‌తో రామ్ వెబ్ సిరీస్

కథానాయకుడు రామ్ త్వరలో 'డబుల్ ఇస్మార్ట్'తో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉంది. కానీ, దీని తర్వాత ఆయన చేయనున్న చిత్రమేదన్నది ఇంకా స్పష్టత ఇవ్వలేదు. అయితే ఇప్పుడాయన తదుపరి ప్రాజెక్ట్ గురించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్.. రామ్‌తో ఓ వెబ్‌సిరీస్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం దీనికి సంబంధించిన చర్చలు చివరి దశలో ఉన్నాయని తెలిసింది. ఈ పనులన్నీ ఓ కొలిక్కి వచ్చాక దీన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. ఇది వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈలోపు రామ్ తన తదుపరి కొత్త సినిమాని పట్టాలెక్కించనున్నారు. ఈ కొత్త కబురుని ఈనెల 15న తన పుట్టినరోజు సందర్భంగా వినిపించనున్నట్లు తెలిసింది.



# భవితవ్యం.. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం

**ఏనుమాముల మార్కెట్‌కు చేరిన ఈవీఎంలు**

**రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్**

**68.86 శాతం పోలింగ్ నమోదు**

**వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం లోక్ సభ స్థానానికి జరిగిన ఎన్నికల పోలింగ్ కు సంబంధించిన ఏడు అసంబ్లీ సెగ్మెంట్లయిన పాలకుర్తి, స్టేషన్ ఘన్ పూర్, వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలను ఏనుమాముల మార్కెట్ లోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచడం జరిగిందని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ బండారు స్వాగత్ రణ్వీర్ చంద్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సంబంధిత ఏఆర్ ఓలతో కలసి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరిచి సీల్ వేసినట్లు వెల్లడించారు. ఈ స్ట్రాంగ్ రూమ్ లకు సీఆర్ పీఎఫ్ పోలీస్ సిబ్బందితో రౌండ్ ది క్లాక్ రెండంచల భద్రత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మంగళవారం ఎలక్షన్ పేపర్ స్ట్రాంగ్ రూంను ఓపెన్ చేసి అబ్జర్వర్ అభ్యర్థుల తరపున వచ్చిన ప్రజా ప్రతినిధుల సమక్షంలో స్క్రూటినీ చేయడం జరిగిందని వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ లలో అతి ఎక్కువ, అతి తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, రీప్లేస్మెంట్ జరిగిన బూత్ లను పరిశీలించడం జరిగిందన్నారు.





### భారీ భద్రత..

ప్రతి స్ట్రాంగ్ రూంకు ఒక గార్డ్ ఉంటారని, వారిచే లాగ్ బుక్ నిర్వహించబడుతుందని, స్ట్రాంగ్ రూం ఆవరణలో ఎవరికి అనుమతి ఉండదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. అభ్యర్థులు వారి తరపున వచ్చే ఏజెంట్ లకు ప్రత్యేక రూం ఏర్పాటు చేసి అక్కడ వరంగల్ పార్లమెంట్ కు చెందిన ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూంల సీసీ పుటేజీలను పెద్ద తెరలు (స్క్రీన్ లు)ఏర్పాటు చేసి ప్రదర్శించడం జరుగుతున్నదని తెలిపారు. అభ్యర్థులు వారి ఏజెంట్లు 24 గంటలు అట్టి పుటేజీలను చూడవచ్చన్నారు. పోలీసుల సమక్షంలో ఇన్నర్ పెరిమీటర్ వరకు వారికి పోలీస్ ఎస్కార్ట్ తో పరిశీలించవచ్చని, ఇట్టి విషయంలో ఎలాంటి సందేహాలు భయాందోళనలు అవసరం లేదని ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఏఆర్ ఓలు అశ్విని తానాజీ వాకడే, డీఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, తహశీల్దార్లు, ఉప తహసీల్దార్ లు, సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 68.86 శాతం పోలింగ్..

వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 68.86 శాతం పోలింగ్ నమోదైనట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య వెల్లడించారు. మొత్తం 18,24,466 మంది ఓటర్లకు గాను 12,56,301 మంది ఓటు హక్కును వినియోగించుకున్నార న్నారు. ఓటింగ్ లో పాల్గొన్న వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 6,29,512 ఉండగా, పురుష ఓటర్లు 6,26,704 మంది, ఇతరులు 85 మంది ఓటు వేశారన్నారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్ ను పరిశీలిస్తే, స్టేషన్ ఘన్ పూర్ అసంబ్లీ సెగ్మెంట్ లో మొత్తం 2,54,110 మంది ఓటర్లకు గాను 2,00,158 ఓటర్లు (78.77 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారని, పాలకుర్తి అసంబ్లీ సెగ్మెంట్ లో 2,55,524 మంది ఓటర్లకు గాను 1,82,515 ఓటర్లు (71.43 శాతం), పరకాల అసంబ్లీ సెగ్మెంట్ లో 2,22,383 మంది ఓటర్లకు గాను 1,70,916 ఓటర్లు (76.86 శాతం), వరంగల్ పశ్చిమ అసంబ్లీ సెగ్మెంట్ లో 2,83,446 మంది ఓటర్లకు గాను 1,49,320 ఓటర్లు (52.68 శాతం), వరంగల్ తూర్పు అసంబ్లీ సెగ్మెంట్ లో 2,58,495 మంది ఓటర్లకు గాను 1,68,234 ఓటర్లు (65.08 శాతం), వర్ధన్నపేట అసంబ్లీ సెగ్మెంట్ లో 2,73,766 మంది ఓటర్లకు గాను 1,97,763 ఓటర్లు (72.24 శాతం), భూపాలపల్లి అసంబ్లీ సెగ్మెంట్ లో 2,76,752 మంది ఓటర్లకు గాను 1,87,395 ఓటర్లు (67.71 శాతం) తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని కలెక్టర్ వివరించారు.

### అందరికీ అభినందనలు..

అందరి సహకారంతో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియ సక్రమంగా, సజావుగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన ఓటర్లకు, ప్రజలకు భాగస్వాములైన అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.

# స్ట్రాంగ్ రూమ్స్‌కు.. మూడంచెల భద్రతా

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**కేంద్ర సాయుధ బలగాలకు సత్కారం**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లోక్ సభ ఎన్నికల నేపత్యంలో స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఎనుమాముల మర్కెట్‌లో ఈవీయంలను భద్రపర్చిన స్ట్రాంగ్స్ రూంలను మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్ల సంబంధించిన సమాచారాన్ని సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరింత భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మూడంచెల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర 144 సెక్షన్ విధించినట్లు వెల్లడించారు. స్థానిక పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర బలగాలు స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పహారా కాస్తున్నారన్నారు. అగ్నిమాపక పరికరాలను సైతం అధికారులు అందుబాటులో ఉంచారన్నారు. స్ట్రాంగ్ రూం ల వద్ద 24 గంటలూ సాయుధ రక్షణ కల్పించామని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ వెంట వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం, అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, సంజీవ్, ఏసీపీలు దేవేందర్, అనంతయ్య, ఇన్స్‌స్పెక్టర్లు పులిరమేష్, సతీష్, ఆర్.ఐ స్పర్జన్‌రాజ్ తదితరులున్నారు.

### కేంద్ర సాయుధ బలగాలకు సత్కారం..

ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించి తిరిగి స్వస్థలాలకు తిరిగి వెళ్తున్న కేంద్ర సాయుధ బలగాలకు చెందిన అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధబలగాలు సమన్వయంతో కలిసి పనిచేయడం ద్వారా ప్రశాంతవంతమైన వాతవరణంలో ఎన్నికలు నిర్వహించామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో బందోబస్తు విధులు నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. పోలీస్ కమిషనర్ సత్కరించివారిలో సనతోదేవి, సోమ్‌జిత్ భగత్, శరత్‌నాథ్, సంజయ్‌కుమార్, అనీష్, రాంనారయణ బిస్వాస్, రాంకుమార్ సా, బాధు, రాంచంద్ర సింగ్ వున్నారు. ఈ కార్యక్రమములో స్పెషల్ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఇన్స్‌స్పెక్టర్, పుల్యాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ కుటుంబ సభ్యులకు.. ధన్యవాదములు

**మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేసీఆర్ ఆశీర్వదించి పంపిన మన పార్టీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపునకు కృషి చేసిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ, పాత హనుమకొండ మండలం, హసన్ పర్తి గ్రామాల గులాబీ కుటుంబ సభ్యులకు మాజీ చీఫ్ విప్, బీఆర్ ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడ దాస్యం వినయ్ భాస్కర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీకి అండగా నిలుస్తున్న వారి రుణం తీర్చుకుంటానన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com